ప్రజాశక్తి
మంగళవారం 2 మే 2023 5
అనంతపురం





అనంతపురం గణేనాయక్ భవన్‌లో జెండా ఎగురవేస్తున్న వి.రాంభూపాల్

పోరాటమే మార్గం...!

◆ ఘనంగా మేడే వేడుకలు ◆ వాడవాడలా రెపరెపలాడిన ఎర్రజెండా

సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమని కార్మికులు నినదించారు. మేడే సందర్భంగా సోమవారం నాడు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ సిపిఎం, సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జెండాలను ఎగురవేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలని నినదించారు. ఐక్య పోరాటలతో కార్మిక వ్యతిరేక పాలకులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమని కార్మికులు నినదించారు. మేడే సందర్భంగా సోమవారం నాడు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ సిపిఎం, సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జెండాలను ఎగురవేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలని నినదించారు. సిపిఎం ఆధ్వర్యంలో నగరంలో మేడే దినోత్సవాన్ని నిర్వహించారు. 26 కేంద్రాల్లో మేడే నిర్వహించి జెండాలు ఎగుర వేశారు. రంగస్వామి నగర్, పెద్ద ముసలమ్మ కాలనీ, శ్రీశ్రీ నగర్, నవయుగ కాలనీ, మహదేవ నగర్, గణేనాయక్ కాలనీ, లీలీ సుందరయ్య కాలనీ, ఇందిరానగర్, అరుణోదయ కాలనీ, నీలిమా సర్కిల్, టిటిడి కళ్యాణమండపం, సిపిఎం కాలనీలు, హెచ్ఎల్‌సి కెనాల్ స్థూపం, ప్రియాంక నగర్, పాతూరు, ప్రజా చైతన్య కాలనీ, జ్యోతిబసు కాలనీ, ఆటోకాలనీల్లో సిఐటియు జెండాలు ఎగుర వేసి మేడే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి, నగర కమిటి నాయకులు ముస్కిన్, వలి, ప్రకాష్, మసూద్, బాబు, వెంకటేష్, జీవా, గఫూర్, ప్రసాద్, ఇస్మాయిల్, రఫీ, ఫక్కృ, రాజు, నూరుల్లా, ఎన్టీఆర్ శీనా, తపోవనం రాజు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో

సిఐటియు ఆధ్వర్యంలో మేడే ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 31 మండలాలు, 6 మున్సిపాలిటీల్లో 200 కేంద్రాల్లో మేడే నిర్వహించారు. అనంతపురం నగరంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట, రైల్వే గూడ్స్ షెడ్ ప్రసన్నాయపల్లి, సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్, తాడిపత్రి బస్టాండ్ సిటి హమాలీలు, భగత్‌సింగ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు జెండాలు ఎగుర వేశారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ హాజరై జెండాను ఆవిష్కరించారు. మేడే వేడుకల్లో 3 వేల మంది కార్మికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో సిఐటియు నగర కార్యదర్శులు ముర్తుజా, వెంకటనారాయణ, బాబు, గూడ్స్‌షెడ్ హమాలీ యూనియన్ నాయకులు సులేమాన్, మసూద్, సుధాకర్, సిటి హమాలీ యూనియన్ నాయకులు రఫీ, రాజన్న, ఆదినారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల పరిరక్షణకు ఉద్యమిస్తాం



అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎవి.నాగేశ్వరరావు..

◆ బిజెపి పాలనలో కార్మికలోకానికి తీరని అన్యాయం
◆ రాష్ట్రాని జరుగుతున్న అన్యాయంపై వైసిపి, టిడిపి, జనసేన స్పందించరా..?
◆ బహిరంగ సభలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కార్మికులు, కర్షకులు, శ్రామికుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం రాబోవు రోజుల్లో ఐక్యంగా ఉద్యమిస్తామని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు అన్నారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరాలు, గ్రామాల్లో వాడవాడలా సిఐటియు జెండాలు ఎగురవేశారు. అనంతపురం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి సప్తగిరి సర్కిల్, టవర్‌క్లాక్ మీదుగా కృష్ణకళా మందిరం వరకు నిర్వహించారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముర్తుజా అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. 8 గంటల పని దినం కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన వీరులను స్మరించుకుంటూ వారి ఆశయాలు, స్ఫూర్తితో రాబోయే రోజుల్లో కార్మికుల హక్కుల సాధన కోసం పోరాడుతామని దీక్షబూనే రోజు మేడే అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక సంరక్షణ చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. హక్కులు హరించేలా లేబర్‌కోడ్‌లు తీసుకొచ్చి కార్మికులను తిరిగి శ్రమ దోపిడీ, వెట్టి చాకిరీలోకి నెట్టేసే విధానాలు అనుసరిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజల సొమ్ములతో ప్రారంభించిన ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అమ్మేస్తోందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను కూడా ప్రయివేటీకరిస్తోందన్నారు. రాజ్యాంగ హక్కులు, ప్రజా స్వామ్యం, కార్మికుల హక్కులపై మోదీ ప్రభుత్వం దాడి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వ విధానాలపై ప్రజలను చైతన్య పరిచి పోరాటాలకు శ్రీకారం చడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే అన్ని కార్మిక సంఘాల పోరాట కార్యాచరణ రూపొందించాయని, ఆగస్ట్ ప్రచారాన్ని నిర్వహించి భవిష్యత్ పోరాటాలకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో పోరాటాలు సాగుతున్నాయని తెలిపారు. ఫ్రాన్స్, ఇటలీ, బ్రిటన్, అమెరికాలో ఉన్న హక్కులను నిలబెట్టుకోవడానికి పోరాటాలు చేస్తున్నారని ఇది అభినందనీయం అన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం కార్మికులతో పాటు, రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. బిజెపి రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్నా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిలు మాట్లాడని పరిస్థితి ఉందన్నారు. ప్రధాన ప్రతిపక్షాలు టిడిపి, జనసేన పార్టీలు కూడా మిన్నకుండి పోవడం నష్టమే అన్నారు. మోదీవైపు ఉంటారో, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం వైపు నిలబడతారో వైఎస్ఆర్‌సిపి, టిడిపి, జనసేన పార్టీలు తేల్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలతో దేశానికి నష్టం జరుగుతోందన్నారు. కరోనా సమయంలో ముందస్తు చర్యలు చేపట్టకుండా లాక్‌డౌన్ విధించిందన్నారు. బిజెపి ప్రభుత్వానికి గుణపాఠం నేర్పే రోజులు దగ్గర పడ్డాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్మికులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. రెగ్యులరైజేషన్ చేస్తామని హామీ ఇచ్చి నిలబెట్టుకోలేదన్నారు. మున్సిపల్ కార్మికులు, స్కీం వర్కర్‌లు అనేక ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎజి.రాజమోహన్, జిల్లా కోశాధికారి గోపాల్, మెడికల్ రెప్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఎటిఎం.నాగరాజు, శ్రీనివాసులు, తిరుమలేష్, ఎర్రిస్వామి, గురురాజు, లక్ష్మినరసమ్మ, వరలక్ష్మి, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షులు విజయ్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి జమున, అగ్రికల్చర్ కోఆపరేటీవ్ సొసైటీ అధ్యక్షులు శ్రీనివాసులు, హమాలీ యూనియన్ నాయకులు బాబు, సుభహాన్, ఆటో యూనియన్ నాయకులు ఆది, నాగరాజు, ఆజాం, గూడ్స్‌షెడ్ హమాలీ యూనియన్ నాయకులు మసూద్, సులేమాన్, సుధాకర్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మన్నీల రామాంజినేయులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి

అర్జీదారుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలి - కలెక్టర్ ఎమ్.గౌతమి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎక్కువగా రెవెన్యూ సంబంధిత సమస్యలు వస్తున్నాయని, వీటి పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమి సూచించారు. సోమవారం నిర్వహించిన స్పందన గ్రీవెన్స్ కార్యక్రమం అనంతరం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, సహాయ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, డిఆర్ఓ గాయత్రిదేవి , అన్సెట్ సిఈఓ కేశవ నాయుడు, ఆర్డీవో మధుసూదన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వివిధ కార్యాలయాలకు విచ్చేసి అర్జీలను సమర్పిస్తూ ఉంటారన్నారు. అలాంటి అర్జీదారుల పట్ల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయిలోనే సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. 24 గంటల నుంచి 48 గంటల్లోపు పరిష్కరించాల్సిన ఆర్జీలు నాలుగు ఉన్నాయని, అలాగే రీఓపెన్ చేయాల్సినవి 27 అర్జీలు ఉన్నాయని వాటిని వెంటనే రీఓపెన్ చేసి అర్జీలను పరిశీలించి నాణ్యతగా పరిష్కరించాలన్నారు. 36 గ్రీవెన్స్ లను ఇంకా ఓపెన్ చేయలేదని, సంబంధిత అధికారులు వాటిని ఓపెన్ చేసి పరిష్కరించాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలకు సంబంధించిన అధికారులు ఆ సమస్యలపై తీసుకున్న చర్యలకు సంబంధించి ప్రతిసమస్య పరిష్కార తీరును పేర్కొంటూ నివేదికలను సిపిఓకు పంపాలన్నారు. జిల్లా అధికారులు సెలవులపై వెళుతున్నప్పుడు మెసేజ్ చేసి వెళ్తున్నారన్నారు. ఇకపై సెలవుపై వెళ్లే అధికారులు 24 గంటలు ముందే నిర్ణీత దరఖాస్తులో పంపాలన్నారు. జగనన్నకు చెబుతాం కార్యక్రమంపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు.

శ్రామికుని గుండె గొంతుకను వినిపించిన 'ఎర్ర పద్యాలు'

సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా రచయితల సంఘం ఏర్పాటు చేసిన 'ఎర్రపద్యాలతో ఒక సాయంత్రం' కార్యక్రమం కార్మిక, శ్రామికుల గుండె గొంతును వినిపించిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అన్నారు. జిరసం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్ అధ్యక్షతన, కళ్యాణదుర్గం రోడ్డులోని ఎస్ఎఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లా రచయితల సంఘం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ఎంతో స్ఫూర్తిదాయకమైందన్నారు. సిపిఐ సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ మాట్లాడుతూ కర్షక, కార్మికుల పక్షాన నిలిచే కవిత్వమే అసలైన కవిత్వం అన్నారు. ఈ దిశగా జిరసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సత్యశోధక్ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షులు పోతుల రాధాకృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రభుత్వాలు కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్నాయన్నారు. కార్మికులకు అందాల్సిన వేతనాలు సరైన సమయంలో అందడం లేదన్నారు. తర్వాత ఎర్రపద్యాల కవిసమ్మేళనాన్ని గోసల నారాయణస్వామి నిర్వహించగా అనేకమంది కవులు వారి కవిత్వాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో చం శాస్త్రి, ముడార్ సుధీర్, తరిమెల అమరనాథరెడ్డి, జిరసం గౌరవ సలహాదారు కంబదూరి షేక్ నబిరసూల్, అప్పిరెడ్డి హరినాథ్‌రెడ్డి, కోటిగారి వన్నప్ప, మిద్దె మురళీకృష్ణ, చేగువేరా హరి, మధురశ్రీ, శివారెడ్డి, ఒంటెద్దు రామలింగారెడ్డి, టీవీ రెడ్డి, అశోక్, మురళి, మౌర్య తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారమివ్వాలి

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఇటీవల కురిసిన భారీ వడగండ్ల వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యాన పంటలు భారీగా దెబ్బతిన్నాయని, కోట్ల రూపాయలు రైతులు పెట్టుబడి పెట్టి నష్టపోయారని తెలిపారు. అనంతపురం, నార్పల, పుట్లూరు, కూడేరు, ఉరవకొండ, గార్లదిన్నె, సింగనమల, గుత్తి, గుంతకల్లు, యల్లనూరు, పెద్దవడుగూరు, యాడికి, రాప్తాడు, రాయదుర్గం, బొమ్మనహాల్, కళ్యాణ దుర్గం మండలాల్లో వరి, అరటి, మొక్కజొన్న, మామిడి, బొప్పాయి, ఆకుతోటలు, పండ్ల తోటలు నిమ్మ, పంటలు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. రైతులు దిక్కుతోచని పరిస్థిలో ఉన్నారని, పంట నష్ట పోయిన రైతులకు నష్టపరిహారం వచ్చే విధంగా వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ అధికారులు పంటనష్టాన్ని అంచనా వేసి ప్రభూత్వానికి పంపాలన్నారు. 2023 మార్చిలో కూడా అకాల వర్షాలతో సుమారు 447393 హెక్టార్లలో రూ.211.91 కోట్లకు పైగా విలువైన చీనీ, మిరప, అరటి, మామిడి, మొక్కజొన్న, టమోటా, కలింగర, కర్బూజ, వేరుశనగ తదితర పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యానశాఖ అధికారులు నివేదికను ప్రభుత్వానికి పంపారని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు నెలరోజుల్లో పరిహారం ఇస్తామని ప్రభుత్వం చెబుతున్న ఇప్పటికి ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించలేదన్నారు. కావున ప్రభుత్వం పంటనష్టపరిహారం నిబంధనలు సవరించి, పంట నష్టపోయిన ప్రతి రైతుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు.

ఆస్తమాని అధిగమిద్దాం..

ఊపిరితిత్తుల వైద్యనిపుణులు డాక్టర్ రంగు సుధీంద్ర
నేడు అంతర్జాతీయ ఆస్తమా దినోత్సవం



ప్రజాశక్తి-అనంతపురం

మందులు, శ్వాస వ్యాయామాలు, జీవన శైలి ద్వారా ఆస్తమాను అధిగమిద్దామని ఊపిరితిత్తుల వైద్యనిపుణులు డాక్టర్ రంగు సుధీంద్ర సూచించారు. నేడు అంతర్జాతీయ ఆస్తమా దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ అలెర్జీ, ఎసిడిటి సమస్యలకు చికిత్స తీసుకోవడం ద్వారా నియంత్రించవచ్చున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చాలామందిని వేధిస్తున్న అతి పెద్ద శ్వాసకోస సమస్య ఆస్తమా (ఉబ్బసం) అన్నారు. వాతావరణంలో క్రమ క్రమంగా చోటు చేసుకుంటున్న మార్పుల వలన ప్రపంచ జనాభాలో దాదాపు 24.5 కోట్లకుపైగా ఈ వ్యాధితో బాధపడుతున్నారన్నారు. వాయి మార్గాల వాపు సన్నబడడం వల్ల గాలి వేగంగా పీల్చడం, పిల్లి కూతలు వంటికి ఈ వ్యాధి లక్షణాలు అన్నారు. సాధారణ ఇండోర్ అలెర్జీ (దుమ్ము పురుగులు, పెంపుడు జంతువులు, బొద్దింకలు) వైరల్ ఇన్ఫెక్షన్లు, పొంగమంచుతో కూడిన పర్యావరణ పరిస్థితులు, అధిక తేమ, ధూమపానం, అధిక బరువు,కొన్ని మందులు ఆస్పిరిన్, నాప్రొక్సెన్, బీటా–బ్లాకర్స్ ఈ పరిస్థితికి కారణం కావచ్చున్నారు. అయితే ఆస్తమాపై అపోహలను విడనాడాలన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా, ప్రాణాయనం చేయడం వల్ల ఆస్తమా రోగులకు ప్రయోజనం ఉంటుందన్నారు. ఆస్తమా మందులు సురక్షితమైనవి, ఆస్తమా అనేది దీర్ఘకాలిక పరిస్థితి కాబట్టి వాటి లక్షణాలు తగ్గించడానికి దీర్ఘకాలిక మందులు అవసరమన్నారు.

సమగ్ర శిక్ష ఇన్‌ఛార్జ్ అసిస్టెంట్ సిఎంఒగా గోపాలకృష్ణ



అనంతపురం : అనంతపురం జిల్లా సమగ్ర శిక్ష ఇన్‌ఛార్జి అసిస్టెంట్ సిఎంఒగా గోపాలకృష్ణను నియమిస్తూ డిఇఒ, డిపిసి, ఎసిసి ఎం.సాయిరామ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న అసిస్టెంట్ సిఎంఒగా తిప్పేస్వామి వ్యక్తిగత కారణాల వల్ల మాతృశాఖకు బదిలీ చేశారు. దీంతో విడపనకల్లు మండలం హావలిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ గోపాలకృష్ణ (ఎస్ఎ తెలుగు)ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



తోపుదుర్తి మహిళా సహకార పాల డెయిరీను ట్రయిల్ రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి


ట్రయల్ రన్ సక్సెస్..!

ప్రారంభానికి సిద్ధంగా తోపుదుర్తి మహిళా సహకార పాల డెయిరీ

ఆత్మకూరు : అనంతపురం రూరల్ మండలం ఆలమూరు జగనన్న లేఅవుట్ పక్కన ఏర్పాటు చేసిన తోపుదుర్తి మహిళా సహకార పాల డెయిరీ ప్రారంభానికి అంతా రంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, సతీమణి మనోరమ, వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలిసి సోమవారం నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ డెయిరీ ఏర్పాటుతో తొలి విడతలో రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా 10 వేల మంది మహిళా పాడి రైతులకు లబ్ధి చేకూరనుంది. ఏడాది కాలంలోనే మరో 20 వేలమందికి లబ్ధి కలగనుంది. అంటే 30 వేల మంది మహిళా రైతులకు మేలు జరగనుంది. అతి త్వరలోనే ముఖ్యమంత్రి జగన్ డెయిరీని ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రైతుల నుంచి రోజూ 1.20 లక్షల లీటర్ల పాల సేకరించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఛైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

అక్రమార్జనపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై ఏదీ..?

విప్ 'కాపు'కు మాజీమంత్రి 'కాలవ' సెల్ఫీ ఛాలెంజ్



సెల్ఫీ ఛాలెంజ్ విసురుతున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

విప్ కాపు రామచంద్రారెడ్డి అసమర్థత, చేతకానితనం వల్లే రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పూర్తి కాలేదని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు విమర్శించారు. తన 50 వారాల సెల్ఫీ ఛాలెంజ్‌లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిపై మూడో వీడియోను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన రాయదుర్గం ప్రాంతంలో పేదలు అధికంగా ఉన్నారన్నారు. ఈప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవల కోసం తాను టిడిపి ప్రభుత్వంలో ఆస్పత్రి సామర్థ్యాన్ని 30 నుంచి 100 పడకలకు పెంచామన్నారు. అప్పట్లోనే సుమారు రూ.17కోట్లు నాబార్డు ద్వారా నిధులు మంజూరు చేయించామన్నారు. తర్వాత విప్ కాపు రామచంద్రారెడ్డి ఆస్పత్రిపై శ్రద్ధ చూపక పోవడంతో అదనపు భవన నిర్మాణం నత్తనడకన సాగుతోందని దుయ్యబట్టారు. వందపడకలతో సకల సౌకర్యాల నడుమ 18మంది వైద్య బందం సేవాలందించాల్సిన ప్రభుత్వాసుపత్రి పాలకుల నిర్లక్ష్యానికి సాక్ష్యంగా నిలిచిందన్నారు. 2019 ఫిబ్రవరిలో వందపడకల ఆస్పత్రికి తాము భూమి పూజ చేయగా వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక విప్ కాపు రామచంద్రారెడ్డి రెండోసారి శంకుస్థాపన చేయించారని ఎద్దేవాచేశారు. అప్పట్లో తానే తెచ్చానని హడావిడి చేసిన ఎమ్మెల్యే నాలుగేళ్లు గడుస్తున్నా పనులను ఎందుకు పూర్తి చేయించలేదని సూటిగా ప్రశ్నించారు. అలాగే నియోజకవర్గంలో వైద్యరంగంలో ఎమ్మెల్యే 'కాపు' సాధించిన అభివృద్ధి శూన్యమన్నారు. తాను శాసనసభ్యుడిగా ఉన్న సమయంలో రూ.3.60కోట్లతో ప్రభుత్వ ఆస్పత్రికి కొత్త భవనాన్ని సమకూర్చానని గుర్తు చేశారు. తెలుగుదేశం ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులను కూడా పూర్తి చేయలేని దద్దమ్మ ఎమ్మెల్యే "కాపు" అని విమర్శించారు. ఎమ్మెల్యే 'కాపు'నకు అక్రమార్జనపై ఉన్న శ్రద్ధ అభివద్ధి పనులపై లేకపోవడంతోనే రాయదుర్గానికి ఈ దుర్గతి దాపురించిందన్నారు.



పారిశుధ్యం పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

పారిశుధ్యంపై దృష్టి సారించాలి : మేయర్

అనంతపురం కార్పొరేషన్ : నగరంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఎక్కడా పారిశుధ్య సమస్య తలెత్తకుండా ప్రజారోగ్య విభాగం దృష్టి సారించాలని మేయర్ మొహమ్మద్ వసీం సూచించారు. సోమవారం నగరంలోని 37వ డివిజన్ పరిధిలో మేయర్ పర్యటించారు. ఈ సందర్భంగా డ్రైనేజీలు పొంగి రోడ్లపై మురుగునీరు ప్రవహించి బురద పెరిగిపోయి ఉండటాన్ని గమణించి ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై అడ్డంగా ఉన్న బురదను తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని నగరపాలక ఆరోగ్య అధికారి గంగాధర్ రెడ్డికి సూచించారు. వెంటనే డోజర్‌ను ఏర్పాటుచేసి బురద తొలగింపు పనులను అధికారులు చేపట్టారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంహెచ్‌ఓ గంగాధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో ఆదాయాన్ని పెంచాలి

రాయదుర్గం రూరల్ : ఆధునిక సాంకేతిక పద్ధతులను ఉపయోగించి రైతులు ఆదాయాలు పెంచుకోవాలని కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం రీసెర్చ్ శాస్త్రవేత్తలు రాధాకుమారి, యుగంధర్, మల్లికార్జున సూచించారు. సోమవారం మండల పరిధిలోనివాటర్‌షెడ్ గ్రామం డి.కొండాపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులకు ఆదాయాన్ని రెట్టింపు చేసే ఆధునిక సాంకేతిక పద్ధతు, ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ అధికారిణి శ్రీవిద్య, జెఇ శ్రీరాములు, టిఇ ఐ, సిబి ఈరన్న, టిఇ విశ్వేశ్వరప్ప, వాటర్‌షెడ్ ఛైర్మన్ ఆంజనేయులు, ఎంపిటిసి శివప్ప, కమిటీ సభ్యులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి

ఉరవకొండ : పారిశుధ్య నిర్వహణలో కార్మికులు చేస్తున్న సేవలు మరువలేనివని ఉరవకొండ లయన్స్ క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున, సర్పంచి లలిత అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ కార్యాలయంలో పంచాయతీ కార్మికులను ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా 56 మంది కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజినల్ ఛైర్మన్ బాలచంద్ర, గౌరవ సభ్యులు చిట్టా శ్రీధర్, నాగేశ్వరావు, ప్రభాకర్‌నాయుడు, నజీర్, పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షులు బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

ఉరవకొండ : విడపనకల్ మండలం గడేకల్ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గతంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో సీసీ రోడ్డు వేయాలని విన్నవించగా స్పందించిన మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి రూ.12లక్షలతో అనుమతులు ఇప్పించినట్లు తెలిపారు. దీంతో భూమిపూజ చేస్తున్నట్లు తెలిపారు. ఈ పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సుశీలా ఉమాశంకర్, ఎంపిటిసి ఓబులేష్, పంచాయతీ సెక్రటరీ సోమయ్య, శిల్ప, వైసిపి నాయకులు కరణం భీంరెడ్డి, ఉమాశంకర్, మాల్యం ఎర్రన్న, సురేష్‌యాదవ్, మాధవరెడ్డి, మనోహర్, లాలెప్ప, రంగమ్మ, లింగమ్మ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న విజయఫలాలను కార్మికులకు అందజేసే వరకూ విశ్రమించబోమని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నేతలు స్పష్టం చేశారు. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు బండారి ఎర్రిస్వామి, ఎటిఎం నాగరాజు అధ్యక్షతన పారిశుధ్య కార్మికుడు బి.కొండన్నతో సిఐటియు జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా సిఐటియు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కప్పల నాగభూషణ మాట్లాడుతూ మన పూర్వీకులు సాధించిన విజయ ఫలాలు, హక్కులు, చట్టాలను ప్రస్తుత కుంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కుతున్నాయన్నారు. ఈనేపథ్యంలో హక్కుల కోసం కార్మికులు ఉద్యమించాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ గంగాధర్‌రెడ్డి, మున్సిపల్ యూనియన్ నాయకులు తిరుమలేశు, సిఐటియు నగర రెండు కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు బాబు, వెంకట నారాయణ, ముర్తుజ, గురురజా, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి లక్ష్మీనారాయణ, కార్మికులు మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం యూనియన్ నాయకులు ఓబుళపతి, మాబు, రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లాకేంద్రంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. ముందుగా దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, పైలా నరసింహయ్య, కొర్రపాడు హుస్సేన్ పీరా, రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్‌అహ్మద్, రజక కార్పొరేషన్ ఛైర్మన్ మీసాల రంగన్న, ఎపిఎస్ ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ మాల్యవంతం మంజుల, ఎడిసిసిబి ఛైర్‌పర్సన్ లిఖిత, వైసిపి సీనియర్ నాయకులు బి.ఎర్రిస్వామిరెడ్డి, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, దాసరి వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్ రిజ్వాన్, రాష్ట్ర కార్యదర్శి గౌస్‌బేగ్, సంయుక్త కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, అనుబంధ విభాగ జోనల్ ఇన్‌ఛార్జి రమేష్‌గౌడ్, జిల్లా అనుబంధ విభాగ అధ్యక్షులు శ్రీదేవి, సైఫుల్లా బేగ్, ఎన్‌వి నారాయణ, మారపురెడ్డి రంగనాథ్‌రెడ్డి, నాయకులు మధుసూదన్, పెన్నోబులేసు, నగర అధ్యక్షులు సోమశేఖర్‌రెడ్డి, నాయీబ్రాహ్మణ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసులు, కార్పొరేటర్లు శ్రీనివాసులు, అనిల్‌కుమార్‌రెడ్డి, మహిళా నేతలు కృష్ణవేణి, కెఎల్.దేవి, చందన శివాజీ, భారతి, శోభారాణి, రాధా యాదవ్, వివిధ కార్మిక సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అలాగే సప్తగిరి సర్కిల్ నందినీ హోటల్ ముందు సిఐటియు కారు స్టాండ్‌లో జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం న్యూటౌన్ నగర కార్యదర్శి రామిరెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు లతీఫ్, స్టాండ్ ప్రెసిడెంట్ సలీం, వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్, కార్యదర్శి రమణ, గౌరవాధ్యక్షులు బాసా, ఎస్‌కెహెచ్ నాయకులు మాబు, చిరుత టెంకాయ చిన్న రమేష్, శీనా, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మే డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నగరంలోని ఇందిరానగర్ కమ్యూనిహాల్ వద్ద ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులకు 8 గంటల పని దినాల అమలు కోసం ఎందరో ప్రాణాలు అర్పించి సాధించుకున్నారని గుర్తు చేశారు. అంతేగాకుండా సమాన పనికి సమాన వేతనం అమలు కావడం లేదన్నారు. మే డే స్ఫూర్తితో మహిళలు పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి రాజేశ్వరి, నగర నాయకులు పర్యాబి, చిల్డ్రన్స్‌క్లబ్ నాయకులు శశిరేఖ, ఖాజాబి, లక్ష్మిదేవి, రేణుక, సునంద తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో మేడే వేడుకలు

తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం టిడిపి అర్బన్ నియోజకవర్గం కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

తాడిపత్రి : అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని సోమవారం తాడిపత్రిలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికుల ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి కేక్ కోసి కార్మికులకు తినిపించారు. అనంతరం రాంభూపాల్ కార్మికులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ కట్టవద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కార్మిక వ్యవస్థను ఉద్దేశించి ప్రసంగించారు.

శింగనమల : ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని సోమవారం మండలవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంతోపాటు తరిమెల, నిదనవాడ, ఆనందరావుపేట, చిన్నమట్లగొంది, రాచేపల్లి, ఉల్లికల్లు, సలకంచెరువు, తదితర గ్రామాల్లో జెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ ఐకమత్యంతో పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎర్రజెండా ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు నాగరాజు, సర్పంచి ఓబులేష్, సిపిఎం మండల కమిటీ సభ్యులు ఉల్లికల్లు లక్ష్మీనారాయణరెడ్డి, సుంకన్న, వెంకటస్వామి, సూర్యప్రకాష్, రామాంజనేయులు, ఎర్రిస్వామి, ఆంజనేయులు, పేట ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, కుళ్లాయిస్వామి, నాగేంద్ర, శ్రీనివాసులు, కొండారెడ్డి, జయరాముడు, పార్టీ సభ్యులు ఆవుల రామాంజనేయులు, రామకృష్ణ, కుళ్లాయప్ప, పుల్లన్న, వెంకట్రాముడు, నల్లప్ప, వెంకటస్వామి, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంతోపాటు వడ్డుపల్లి తదితర గ్రామాల్లో సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జెండాలు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శివశంకర్, రామయ్య, రాము, సోమశేఖర్, వెంకటమ్మ, సరస్వతమ్మ, పంచాయతీ కార్మికులు, ఆటో కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి ఆధ్వర్యంలో మేడే వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజాశక్తి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని బళ్లారి రోడ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని పాత విఆర్‌ఎల్ గోడౌన్ వద్ద ఉన్న ప్రజాశక్తి కార్యాలయంలో ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ ఎన్.వేణుగోపాల్, డెస్క్ ఇన్‌ఛార్జి టి.శివప్రకాశ్ ఆధ్వర్యంలో మేడే జెండాను ఎగురవేశారు. అనంతరం కార్యాలయం ఎదుట మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. సిబ్బంది పాత్రికేయులు ఇందులో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేనేజర్ మేడు ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి జిల్లా ఇన్‌ఛార్జి మురళి, సిబ్బంది డేవిడ్, రవిచంద్ర, సుధాకర్, రామాంజినేయులు, చెన్నకేశవులు, గిరి, ఫ్రాన్సిస్, రవి పాల్గొన్నారు.



జెండాను ఎగురవేస్తున్న ప్రజాశక్తి మేనేజర్ వేణుగోపాల్, ఎడిషన్ ఇన్‌ఛార్జి శివప్రకాష్, సిబ్బంది

కణేకల్లు : మండల కేంద్రంలోని భగత్‌సింగ్ ఆటో యూనియన్ అధ్యక్షుడు టి.అయూబ్ ఆధ్వర్యంలో శనివారం జెండాను ఎగురవేశారు. అనంతరం కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు సుభాన్, రాము, రియాజ్, యల్లప్ప, రెహమాన్, అబ్దుల్, కుమార్, సిఐటియు నాగరాజు, కాకడి శర్మాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్ మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగాఉరవకొండలోని సిఐటియు కార్యాలయ ప్రాంగణం, చిన్నకౌకుంట్ల, పెద్దకౌకుంట్ల, ఇంద్రావతి, విడపనకల్ మండల కేంద్రంలోని ఎఐటియుసి కార్యాలయం, కరకముక్కల, వజ్రకరూరు మండల కేంద్రంతోపాటు గూళ్లపాళ్యం, కమలపాడు తదితర గ్రామాల్లో జెండాలు ఎగురవేశారు. ముందుగా పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, సిఐటియు నాయకులు రంగారెడ్డి, రైతుసంఘం నాయకులు జ్ఞానమూర్తి, వజ్రకరూరు సిపిఎం మండల కన్వీనర్ విరుపాక్షి, ఎఐటియుసి నియోజకవర్గ నాయకులు చిన్నరాయుడు, పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు రెడ్డి, హమాలీ సంఘం నాయకులు గోపాల్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే క్యాంపు వై.విశ్వేశ్వర్‌రెడ్డి కార్యాలయంలో సర్పంచి లలిత, ఎంపిపి చంద్రమ్మ, జెడ్పిటిసి పార్వతమ్మ, ఆటో యూనియన్ నాయకులు ఆటో సీనా ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా వై.విశ్వేశ్వరరెడ్డి కేక్ కోసి కార్మికలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వన్నూరుసాబ్, నాయకులు శంకరయ్య, జోగి భీమన్న, వాలంటీర్ తేజా, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని ఉద్దేహాల్ గ్రామంలో హమాలీ సంఘం అధ్యక్షులు పెన్నయ్య ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జెండాను ఎగురవేశారు. అనంతకం కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కమిటీ నాయకులు ఓబులేసు, మధ్యాహ్న భోజనం సంఘం లీడర్లు పొన్నూరుస్వామి, లింగదాల శ్రీనివాసులు, యుటిఎఫ్ టీచర్ల నాయకులు గోవిందరాజులు, ఐకెపి లీడర్లు, విఆర్‌ఎలు, అంగన్‌వాడీలు, టీచర్ల యూనియన్ నాయకులు, ఆశావర్కర్లు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పుట్లూరు : ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జెండాలు ఎగురవేసి కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు విటి.రామాంజినేయులు, ఎస్.సూరి, జి.వెంకటచౌదరి, నాగేంద్రమ్మ, సి.రమాదేవి మాట్లాడుతూ ఎంతోమంది కార్మికుల త్యాగఫలమే మేడే అన్నారు. పోరాడి హక్కులు సాధించుకున్నందుకే కార్మిక దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి నాగేంద్రమ్మ, ఆశావర్కర్స్ యూనియన్ మండల లీడర్స్ రమాదేవి, సుబ్బమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు టి.పెద్దయ్య, కార్యదర్శి బి.భాస్కర్‌రెడ్డి, కెవిపిఎస్ మండల కార్యదర్శి నాగభూషణం, కార్మికులు రాజకుళ్లాప్ప పాల్గొన్నారు.

గుత్తి : ప్రపంచ కార్మిక దినోత్సవ వేడుకలను సిఐటియు ఆధ్వర్యంలో గుత్తిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గాంధీ కూడలిలో రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం ఎదురుగా మున్సిపల్ యూనియన్ నాయకురాలు వెంకటమ్మ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నూర్‌మొహమ్మద్, అధ్యక్షులు నాగభూషణం, సిఐటియు మండల కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ కార్మిక, కర్షక హక్కులను కాపాడుకుందామన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని మోడీ ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. వంటగ్యాస్, పెట్రోలు, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎస్.మున్నీ, మున్సిపల్ కాంట్రాక్ట్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి రామాంజి, అధ్యక్షులు మహేష్, నాయకులు సూరి, సుంకన్న, జన విజ్ఞాన వేదిక మండల కార్యదర్శి వెంకటరామిరెడ్డి, నాయకులు శ్రీధర్ గౌడ్, కేశవ, దేశాయి నాగరాజు, అంగన్వాడీ ఆయాలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. దాసరి కాలనీలో ఐద్వా మండల కార్యదర్శి రేణుక ఆధ్వరంలో మేడే వేడుకలు నిర్వహించారు. అలాగే ఎఐటియుసి ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్ వద్ద, ఎన్టీఆర్ సర్కిల్లో ఆటో స్టాండ్ వద్ద జెండాను ఆవిష్కరించారు. అలాగే మన్రో సత్రం వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవ వేడుకలు జరిగాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



తాడిపత్రిలో కేక్ కోస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

నార్పల : మండల కేంద్రంలో సోమవారం మేడే వేడుకలను వామపక్ష నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సిపిఎం కాలనీలో సిపిఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, సిపిఐ కాలనీలో సిపిఐ మాజీ మండల కార్యదర్శి నూరుబాషా ఆధ్వర్యంలో జెండాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సూర్యనారాయణ, మసూద్‌బి, చాపల రామాంజి, శేషు, మసూద్‌వలి, బాషా, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంతోపాటు రెడ్డిపల్లి, రోటరీపురం గ్రామాలతోపాటు మరో 10 కేంద్రాల్లో సోమవారం ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అణగారిన ప్రజలు తమ విముక్తి కోసం రక్తంతో చరిత్రను లిఖించిన రోజును మేడే అని గుర్తు చేసుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా శ్రమిస్తూ, భారాలు మోస్తూ, కష్టాలు పడుతున్న వారి దినోత్సవం ఇదేనన్నారు. ఈ కార్యక్రమంలో బుక్కరాయసముద్రం సర్పంచి ఎ.పార్వతి, నాయకులు పూల నారాయణస్వామి, పండ్ల తోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి, డివైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు బాలకృష్ణ, నరసింహారెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి ఆర్.కుళ్లాయప్ప, సిఐటియు మండల కార్యదర్శి సి.నాగేంద్ర, రైతుసంఘం జిల్లా నాయకులు డి.శ్రీనివాసులు, సంజీవరెడ్డి, రెడ్డిపల్లి హమాలీ యూనియన్ నాయకులు నాగేంద్ర, రోటరీపురం హనుమాన్ హమాలీ యూనియన్ నాయకులు నారాయణ, నెట్టికంటయ్య గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆర్.ఎర్రకొండప్ప, బి. సుబ్రహ్మణ్యం, ఎరినాగప్ప, నారాయణ, బుక్కరాయసముద్రం హమాలీ యూనియన్ నాయకులు రుద్రప్ప, భగత్‌సింగ్ ఆటో యూనియన్ నాయకులు సూరి, బాషా, లక్ష్మన్న, శ్రీనివాసులు, ఎర్రన్న, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : కేంద్రంలోని ప్రధాని మోడీ, రాష్ట్రంలోని సిఎం జగన్‌రెడ్డి కార్మిక ద్రోహులుగా మారారని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నూర్‌మొహమ్మద్ మండిపడ్డారు. మేడే సందర్భంగా సోమవారం సిఐటియు అధ్వర్యలో పట్టణంలో కార్యాలయం వద్ద, వివిధ ప్రాంతాల్లో జెండాను ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని నిర్వహించిన సభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నూర్‌మొహమ్మద్ మాట్లాడుతూ ఆనాడు కార్మికులు ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న చట్టాలు బిజెపి ప్రభుత్వం తుంగులో తొక్కుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రయివేటీకరణను వేగవంతం చేస్తోందని విమర్శించారు. ఈనేపథ్యంలో కార్మిక హక్కులకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా మాజీ కార్యదర్శి డి.శ్రీనివాసులు, నాయకులు దాసరి శ్రీనివాసులు, మారుతీప్రసాద్, సిఐటియు పట్టణ అధ్యక్షుడు కసాపురం రమేష్, మున్సిపల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.నరసయ్య, జగదీష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు గంగ, రేష్మ, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిరూరల్ : ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని సోమవారం మండలవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భముగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల చట్టాలను కాలరాస్తోందన్నారు. కావున హక్కుల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకురాలు కవిత, అంజి, వన్నూరప్ప, పంచాయతీ కార్మికులు రామకృష్ణ, పూసల సంఘం నాయకులు చంటి, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు, మల్లికార్జున, స్థానిక నాయకులు మధు, సంగమేష్, రమేష్, శంకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని భగత్‌సింగ్ ఆటో యూనియన్, మున్సిపల్ కార్యాలయం, సివిల్‌సప్లయ్ హమాలీ యూనియన్, శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటి పంపుహౌస్‌ల వద్ద జెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్‌ప్రసాద్, జిల్లా అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ 8 గంటల పనిదినాలకు చట్టబద్ధత కోసం పరిశ్రమల యాజమాన్యాలతో పోరాడి రక్తం చిందించడం వల్ల నేడు ప్రతి కార్మికుడు సమయపాలనతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. అలాంటి అమరులైన కార్మికులను మనమందరం సదా స్మరించుకోవాలన్నారు.



కణేకల్లు, పామిడి, శింగనమల మండలాల్లో జెండాలను ఎగురవేస్తున్న వామపక్షాల నాయకులు



నేలకొరిగిన అరటి పంటను చూపుతున్న రైతులు

నేలకొరిగిన అరటిచెట్లు

బెలుగుప్ప : మండల పరిధిలోని కోనాపురం గ్రామంలో ఆదివారం రాత్రి కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షానికి దాదాపు 26 ఎకరాల్లో అరటి చెట్లు నేలకొరిగాయి. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన రైతు నవీన్ 9 ఎకరాలు, ధనుంజయ రైతుకు చెందిన 9 ఎకరాలు, ఆవులెన్న గ్రామానికి సర్పంచు రామ్మోహన్‌చౌదరి 8 ఎకరాల్లో అరటి పంట సాగు చేశారు. ఈనేపథ్యంలో గత రాత్రి కురిసిన వర్షానికి పంట మొత్తం నేలకొరిగింది. ఆరుగాలం కష్టపడి రూ.లక్షలు పెట్టుబడి పెట్టి అరటి పంట ఇలా నాశనం కావడంతో పూర్తిగా నష్టపోయామని బాధిత రైతులు వాపోయారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అంచనా వేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుత్తి : స్థానిక రైల్వేస్టేషన్‌లో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. 1వ ప్లాట్‌ఫామ్‌పై దాదాపు 50 సంవత్సరాల వయసు ఉన్న వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండడాన్ని ప్రయాణికులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న జీఆర్పీ పోలీసులు 108 వాహనాన్ని ద్వారా గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు వెల్లడించారు.



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

పిడుగుపాటుకు 18 గొర్రెలు మృతి



మృతిచెందిన గొర్రెలు

బొమ్మనహాల్ : మండలంలోని కొత్తూరు గ్రామంలో ఆదివారం రాత్రి పడిన పిడుగుపాటుకు కురుబ లింగారెడ్డికి చెందిన 18 గొర్రెలు మృతిచెందాయి. వివరాల్లోకి వెళ్తే... లింగారెడ్డి గ్రామ సమీపంలో షెడ్డు ఏర్పాటు చేసుకుని రాత్రి గొర్రెలను ఉంచుకున్నాడు. ఈనేపథ్యంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పిడుగు పడింది. దీంతో 18 గొర్రెలు మృతిచెందాయి. ఒక్కొక్క గొర్రె విలువ సుమారు రూ.9వేలు ఉంటుందని, రూ.2లక్షల వరకూ నష్టపోయామని బాధితుడు వాపోయాడు. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి వెంకటరెడ్డి మృతిచెందిన గొర్రెలను పరిశీలించారు. మృత గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. అలాగే తహశీల్దార్ శ్రీనివాసులు కూడా మృతిచెందిన గొర్రెలను పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక పంపుతామని తెలిపారు. ఇకపోతే మండలంలో 3.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

7లోగా ఇకెవైసి చేయించుకోండి

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు ఈనెల 7వ తేదీలోగా తమ సిఎఫ్ఎంఎస్ ఐడి నెంబర్‌తో ఆధార్ నెంబర్ ఇకెవైసి ద్వారా అనుసంధానం చేయించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.పెద్దన్నగౌడ్, శీలా జయరామప్ప సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఖజానా కార్యాలయం ద్వారా పెన్షన్ పొందుతున్న జిల్లాలోని పెన్షనర్‌లు, ఫ్యామిలీ పెన్షనర్‌లు తప్పకుండా ఈకెవైసి చేయించుకోవాలన్నారు.

వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు విశ్రాంతినివ్వాలి

అనంతపురం కలెక్టరేట్ : వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులను వివిధ కార్యక్రమాల నుంచి మినహాయించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు డిమాండ్ చేశారు. సోమవారం ఉపాధ్యాయ భవన్‌లో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ వేసవి సెలవులు వచ్చినప్పటికి ఉపాధ్యాయులకు ఉయ్ లవ్ రీడింగ్, నాడు- నేడు, పీఎంశ్రీ పాఠశాలలు ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాలు తదితర అనేక కార్యక్రమాలు రూపొందించి ఉపాధ్యాయులను ఉక్కిరిబిక్కిరి చేస్తూ ప్రశాంతత లేకుండా చేయడం సరికాదన్నారు. మానసిక భయాందోళనలకు గురి చేయడం ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. బదిలీలు, పదోన్నతులు ఈ వేసవి సెలవుల్లోనైనా పకడ్బందీగా శాస్త్రీయబద్ధంగా రూపొందించి పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డిఎలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటేష్, సిరాజుద్దీన్, అసోసియేట్ కార్యదర్శి హనుమప్ప, గౌరవాధ్యక్షులు ప్రభాకర్, సీనియర్ నాయకులు బి.వెంకటేశులు, కె.ముత్యాలు, ఇజి.నాగభూషణం, జిల్లా సబ్ కమిటి సభ్యులు నాగరాజు, బొమ్మయ్య, మోహన్‌రెడ్డి, రామాంజినేయులు, సతీష్, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

చేనేత మగ్గాలు పంపిణీ

పెద్దపప్పూరు : మండలం కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో చేనేత (ఎస్సీ)లకు మంజూరైన పనిముట్లను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సోమవారం పంపిణీ చేశారు. ఈ సుందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చాక కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలంటే మరోసారి సిఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఈ జాతీయ ఉపాధి హామీ పథకం సభ్యుడు వేమనాథరెడ్డి, మండలాధ్యక్షులు రామ్మూర్తిరెడ్డి, ఉపాధ్యక్షులు బండలదిన్నె రామయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డి, జెడ్పిటిసి రమాదేవి, ముచ్చుకోట అమర్నాథ్‌రెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, పసులూరు పురుషోతం, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంసెట్ మోడల్ పరీక్షలను సద్వినియోగం చేసుకోండి

గుంతకల్లు : రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మోడల్ ఎంసెట్ పరీక్షలలో భాగంగా ఈనెల 6న గుత్తి గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించే మోడల్ ఎంసెట్ (ఆన్‌లైన్) పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక శస్త్ర జూనియర్ కళాశాలలో గేట్స్ కళాశాల డైరెక్టర్ వాణి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి రమేష్,శస్త్ర జూనియర్ కళాశాల కరస్పాండెంట్లు,శేఖర్, రమణ ఇందుకు సంబంధించిన మోడల్ పరీక్ష కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంసెట్ పరీక్ష ఆన్‌లైన్‌లో ఉంటుందన్నారు. కావున ఎంసెట్‌కు పరీక్షకు సిద్ధం అయ్యే విద్యార్థులందరూ కంప్యూటర్ మీద అవగాహన ఉండాలన్నారు. అదేవిధంగా సమయం ఉపయోగించుకునే పద్ధతి, తదితర అంశాలను అవగాహన కల్పించడానికి ఈ మోడల్ ఎంసెట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పరీక్షకు హాజరుకావాలనుకున్న విద్యార్థులు సెల్..84660 88847, 62819 63077 నెంబర్లను సంప్రదించాలని కోరారు.



ఎంసెట్ మోడల్ పేపర్‌ను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

మళ్లీ జగన్ పాలననే కోరుకుంటున్న ప్రజలు

ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

ప్రజాశక్తి-గుంతకల్లు


వైసిపి ప్రభుత్వం చేపట్టిన 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు వెళ్లగా మళ్లీ సిఎం జగన్ పాలననే కోరుకుంటున్నారని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నియోజకవర్గంలో 86.63 శాతం పూర్తి చేశామన్నారు. ఈసందర్భంగా 65 శాతం మంది ప్రజలు మిస్డ్ కాల్స్ ద్వారా సిఎం జగన్ పాలనకు మద్దతు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఎన్.రామలింగప్ప, వైసిపి ఎస్సీ సెల్ రాయలసీమ కన్వీనర్ జింకల రామాంజినేయులు, మార్కెట్ యార్డు ఛైర్మన్ మోహన్, జడ్పీటిసి కదిరప్ప, వైసిపి మండల కన్వీనర్ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆగలూరేశ్వరస్వామి పట్టాభిషేకం

బెలుగుప్ప : మండల కేంద్రంలో వెలిసిన రాజుగారి గోత్రం, మల్లెల వంశంబులు గుండ్లవారి ఆరాధ్య దైవం ఆగులూరేశ్వరస్వామి సామ్రాజ్య పట్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం పవిత్ర గంగా కలశాలతో ఆగులూరేశ్వరస్వామికి కలశపూజ, గణపతి పూజ, పుణ్యహవాచనం, మహాగణపతి హారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహంచారు. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాష్ట్రంతోపాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భారీ ఎత్తున భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆహ్వాన సంఘం పి.ఈశ్వరప్ప, ఆగులూరేశ్వరస్వామి ఆలయ ఆహ్వాన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

100 మంది రక్తదానం

రాయదుర్గం : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో వందమంది రక్తదానం చేశారు. సొసైటీ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి ఆధ్వర్యంలో దాదాపు వందమంది యువత రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు నిర్వాహకులు ప్రశంసాపత్రాలు అందజేశారు. రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకుకు సేకరించిన రక్తాన్ని తరలించనున్నట్లు కాపు భారతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ జిల్లా కమిటీ సభ్యుడు వీరన్న, రాయదుర్గం పురపాలక సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వలిబాష, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, పట్టణ కన్వీనర్ ముస్తాక్, గుమ్మగట్ట మండల కన్వీనర్ మంజునాథ, పార్టీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, కాంత రెడ్డి, రవి, రిబ్కా, మున్సిపల్ వార్డు సభ్యులు గోవిందా, మంజునాథ, తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న సొసైటీ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి



రాయదుర్గంలో దిష్టిబొమ్మ ప్రదర్శనను అడ్డుకుంటున్న పోలీసులు



శింగనమలలో ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

రాష్ట్రంలో రాజ్యమేలుతున్న అవినీతి

టిడిపి ఆధ్వర్యంలో జగన్ పది తలల రావణుని బొమ్మతో నిరసనలు

ప్రజాశక్తి-రాయదుర్గం

జగన్‌రెడ్డి దుష్టపాలన కన్నా రావణాసుర రాక్షస రాజ్యమే మెరుగనిపిస్తోందని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు దుయ్యబట్టారు. సోమవారం పట్టణంలో జగనాసుర పేరిట అవినీతి, అక్రమాల పది తలల దిష్టిబొమ్మతో టిడిపి నాయకులు నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు నడిరోడ్డుపై దిష్టిబొమ్మను చించివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ అన్ని వర్గాలను అణచివేస్తూ, ప్రజాస్వామ్యానికి పాతరేస్తూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నాడన్నారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు జగన్ మాఫియా పాలనకు వ్యతిరేకంగా టిడిపి ఆధ్వర్యంలో శాంతియుతంగా చేస్తున్న నిరసన తెలుపుతుంటే పోలీసులు అడ్డుకోవడం బాధాకరమన్నారు. ప్రతిపక్షాల నిరసనలను పోలీసు బలంతో అడ్డుకుంటున్న జగన్ తన పాపాలను, తప్పిదాలను ఇంకెన్నాళ్లు కప్పిపుచ్చుకోగలరని ప్రశ్నించారు. అరకొర సంక్షేమంతో బడుగులకు సీఎం తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పాలన నలుగురు రెడ్ల చేతిలో నలిగిపోతోందన్నారు. అభివృద్ధి ఎక్కడా ఇసుమంతైనా కనిపించడం లేదన్నారు. జగన్ రెడ్డి పాలనపై విసుగు చెందిన బడుగు బలహీన వర్గాలతో పాటు మైనారిటీలు వైసీపీని గద్దె దించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలే అందుకు తాజా సాక్ష్యమన్నారు. ఇకపోతే స్థానిక ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి ఇసుక, అక్రమ మద్యం వ్యాపారాలను యథేచ్ఛగా సాగిస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మండల కన్వీనర్ కురుబ హనుమంతు, కౌన్సిలర్ కురుబ ప్రశాంతి, మాజీ కౌన్సిలర్లు టంకశాల హనుమంతు, పోరాళ్ల పురుషోత్తం, బండి భారతి, టిఎన్‌టియుసి మల్లేష్, వెంకటేశులు, ఎస్సీ సెల్ మల్లి, బిసి సెల్ పూజారి తిప్పయ్య, నాయకుల తిప్పేస్వామి, పైతోట అంజి, డబ్బిడి శివ, వేణు, సిమెంట్ శీనా, కెడిమి తిప్పేస్వామి, సోము, సర్పంచ్ నాగరాజు, నాగరాజు, ఆశోక్, సత్తి, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : జగనాసుర నేర చరిత్రకు అంతే లేదని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి అన్నారు. సోమవారం టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో సిఎం జగన్ పది తలల చిత్రాన్ని స్థానిక నేతలతో కలిసి వైయస్ జగన్ అవినీతి చరిత్రను వివరిస్తూ ఒక్కొక్క తలను చించి వేస్తూ నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ నేర చరిత్రకు అవినీతికి అంతే లేకుండా పోయిందని, రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు నాశనం చేశాడన్నారు. మద్యం, గంజాయి రాష్ట్రం కేర్ ఆఫ్ గా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకులను బెదిరిస్తూ, కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు దేవర్ల మురళి, టిడిపి నగర అధ్యక్షుడు మారుతి కుమార్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు డిష్ నాగరాజు, నగర మహిళా అధ్యక్షురాలు విజయ్ శ్రీ రెడ్డి, బుల్లె శివబాల సంగా తేజస్విని, కూచి హరి, రాయల్ రఘు, గోపాల్ గౌడ్, పూల బాషా, చల్లా పద్మావతి, వెంకటలక్ష్మి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో పది తలల జగన్ దిష్టిబొమ్మను చూపుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

శింగనమల : రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక అవినీతి రాజ్యం ఏలుతోందని టిడిపి నాయకులు విమర్శించారు. టిడిపి పిలుపుమేరకు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి ఆలం నరసానాయుడు ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. రామస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆర్టీసీ బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకూ సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతితోపాటు భూ, మైనింగ్ మాఫియా రెచ్చిపోతోందన్నారు. రానున్న కాలంలో జగన్‌కు బుద్ధి చెప్పి చంద్రబాబును సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి, మాజీ జెడ్పిటిసిలు ఆలం వెంకటనరసానాయుడు, రామలింగారెడ్డి, దండు శ్రీనివాసులు, గోరంట్ల మారుతీనాయుడు, మాసూలు చంద్రమోహన్, కన్వీనర్లు నార్పల ఎర్రినాగప్ప, బుక్కరాయసముద్రం అశోక్, గార్లదిన్నె పాండు, రాష్ట్ర రైతుసంఘం కార్యదర్శి వెంకటేశ్వర్‌నాయుడు, పెద్ద నాగముని, మాజీ ఎంపిటిసిలు రాఘునాయుడు, చెన్నరాయుడు, మునీంద్ర, సర్పంచి రాజు, కేశన్న, జిల్లా బీసీ సెల్ కార్యనిర్వాహకార్యదర్శి కొయ్యగూర పెద్దన్న, శింగనమల గ్రామ కమిటీ అధ్యక్షులు బండి వెంకటనారాయణ, ముంత వెంకటేష్, ఎస్సీ సెల్ నాయకులు డాల్ వీరనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా ఆశావర్కర్లు పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సూచించారు. ఇటీవల నియమితులైన ఆశావర్కర్లు సోమవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆశావర్కర్లు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలని సూచించారు. ఆశావర్కర్లు సంతోషంగా ఉంటేనే గ్రామీణ స్థాయిలో వైద్యసేవలు సమర్థవంతంగా అందిస్తారని భావించిన సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు రూ.3వేల రూ.10 వేలకు వేతనాలను పెంచారన్నారు. కావున ఆయన ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లలిత, ఎంపిపి చంద్రమ్మ, జెడ్పిటిసి పార్వతమ్మ, వైస్ ఎంపిపి నరసింహులు, వార్డు సభ్యులు పద్మావతి, వసికేరి మల్లికార్జున, ఎంపిటిసి వన్నూరుసాబ్, ఎంబిసి కార్పొరేషన్ డైరెక్టర్ జోగి వెంకటేష్, నాయకులు బసవరాజు, నిర్మలా, జోగి భీమన్న, రామిరెడ్డి, అమర్నాథ్, శర్మస్, విజయ్, మనోహర్, మూర్తి, చిన్నా, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

గిరిజనుల సమగ్రాభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

అన్నిరంగాల్లో గిరిజనుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని గిరిజన సంఘాల జెఎసి ఛైర్మన్ శివశంకర్‌నాయక్ అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని అన్ని గిరిజనల సంఘాల నాయకులు సమావేశం ఏర్పాటు చేసి ఛైర్మన్‌గా శివశంకర్‌నాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ అనేక చోట్ల గిరిజనులకు ఇళ్లు, విద్య, వైద్య, రవాణా సౌకర్యాలు లేక పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గిరిజనుల చైతన్యం కోసం అహర్నిశలూ కృషి చేస్తామనన్నారు. ఈ సమావేశంలో జెఎసి తిప్పేస్వామినాయక్, గోవింద్‌నాయక్, ధనంజుయనాయక్, నాగరాజునాయక్, బాబునాయక్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివశంకర్‌నాయక్